ఆటోలో నగల బ్యాగు మరిచిపోయిన మహిళ

● బాధితురాలికి తిరిగి అప్పగించిన మీర్‌పేట్ పోలీసులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఆటోలో నగల బ్యాగు మరిచిపోయిన ఓ మహిళ.. ఆ తర్వాత ఈ విషయాన్ని మీర్‌పేట్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో రంగంలోకి దిగిన పోలీసులు సదరు నగల బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని గోషామహల్ గోడేకీకబర్ ప్రాంతానికి చెందిన కేశపాగ స్వర్ణలత అనే మహిళ గత నెల 28వ తేదీన ఆటోలో బయలుదేరి మీర్‌పేట్‌లోని నందనవనంలో తమ బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు హాజరైంది. ఈ క్రమంలో ఆమె తన నగలు ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయింది. అనంతరం ఈ విషయాన్ని మీర్‌పేట్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. దాంతో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా సదరు ఆటోను గుర్తించి నగల బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగును ఆదివారం వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి బాధితురాలికి తిరిగి అప్పగించారు.

వేర్వేరు ఘటనలో ముగ్గురు అదృశ్యం

సైదాబాద్(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనలో ముగ్గురు వ్యక్తులు అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనగాం జిల్లా దేవరుప్పుల మండల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చింత నాగమణి భర్త ఆంజనేయులు(46) పీజీ పరీక్షలు రాసేందుకు గత నెల20న నగరానికి వచ్చి చంపాపేటలోకి వికలాంగుల వసతి గృహంలో ఉన్నాడు. మరుసటి రోజు హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో అతడి ఆచూకీ తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..

సింగరేణి కాలనీ నివాసి ఇందావత్ చందు(47) పక్షవాతం కారణంగా మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. అతడి భార్య నీల సెల్స్ గర్ల్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శనివారం మధ్యాహ్నం చందు ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడి సహాయంతో ఆటో ఎక్కి వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యాపారి అదృశ్యం..

ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యాపారి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైదాబాద్‌లో నివాసముండే కటకం శ్రీనివాస్(52) వ్యాపారంలో ఇబ్బందులు రావడంతో ఆర్థిక, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ఏఈఈ ఫలితాలలో ఎంపికైన అభ్యర్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్

తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

● ప్రొఫెసర్ కోదండరామ్

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని తెలంగాణ జన సమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాల్లో గెజిటెడ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన 509 మంది గేట్ మాస్టర్స్ అభ్యర్థులను ఆదివారం సరూర్‌నగర్‌లోని పాపడమ్స్ బ్లూ కాన్ఫరెన్స్ హాల్‌లో కోదండరామ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు రాజకీయ నాయకులు కానీ బాస్‌లు కానీ ప్రధానం కాదన్నారు. చట్టమే మీకు అన్నిటినీ మించిన సుప్రీం అని చెప్పారు. తప్పు అని తెలిసి కూడా తప్పు చేస్తే తిప్పలు తప్పవన్నారు. నిజాయితీగా నిబద్ధతతో కూడిన ఉద్యోగం చేస్తే అందరూ మీకు సలాం చేస్తారన్నారు. అలా కాకపోతే మీరు అందరికీ సలాం చూస్తూ తలదించుకోవాల్సి వస్తుందన్నారు. ఏఈఈ ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన బి. వెంకట్‌రెడ్డికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో పనిచేస్తున్న డీఈఈలు పాల్గొని సలహాలు, సూచనలు అందజేశారు. గేట్ మాస్టర్స్ డైరెక్టర్ యాస వెంకట్‌రెడ్డి, టీజేఎస్ నేతలు కేవీ రంగారెడ్డి, పల్లె వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి

● తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఘోర శ్యాంసుందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరపటేల్‌ను ఆదివారం తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దేశ్వర పటేల్‌ను పరామర్శించిన వారిలో కమిటీ ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ ఇన్‌చార్జి కేవీగౌడ్, కుల గణన పోరాట కమిటీ అధ్యక్షుడు అవ్వారు వేణుకుమార్, అంబేడ్కర్ ఆజాద్ సంఘ అధ్యక్షుడు కొంగర నరహరి తదితరులు పాల్గొన్నారు.

గాలి కాలుష్యంతో శ్వాస వ్యాధుల విజృంభణ

● వైద్య నిపుణుడు వీరపనేని విష్ణున్‌రావు



హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తి చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బసం, శ్వాసకోశవ్యాధులు విజృంభిస్తున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడ ప్రమాదంలో పడుతుందని ప్రముఖ వైద్య నిపుణుడు, శ్వాస హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ వీరపనేని విష్ణున్‌రావు పేర్కొన్నారు. శ్వాస సంబంధమైన వ్యాధులపై ఆయన కొన్ని దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు, సైనస్, ఉబ్బసం వ్యాధులపై పరిశోధన సంస్థలు ఇచ్చే నివేదికలను కూడా అధ్యయనం చేస్తున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. నగరంలో నివసించే వారికి వాహన, పరిశ్రమల వల్ల వెలువడే కాలుష్యం గాలి ద్వారా ఊపిరితిత్తులకు ప్రవేశిస్తుందన్నారు. వర్షం నీటి తడివల్ల నేల, చెట్లు, భవనాలు, చెత్తాచెదారం ఒకవిధమైన బ్యాక్టీరియాను కలిగి ఉంటాయని, గాలి కలుషితం ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షా కాలంలో హోటళ్లు, ఆరుబయట రోడ్లపై విక్రయించే ఆహార పదార్థాలు తినొద్దన్నారు. రోజువారీ వ్యాయామం, ఇతరత్రా జాగ్రత్తల వల్ల వ్యాధులను అదుపులో ఉంచవచ్చన్నారు.


నాగోల్ ప్రాంతంలో వర్షానికి తడుస్తున్న వినాయక విగ్రహాలు


చంపాపేట రెడ్డికాలనీలో ప్రవహిస్తున్న వర్షపునీరు


నిండుకుండలా మారిన మంగలోని కుంట

ఎడతెరిపి లేని వర్షం..

జనజీవనం అతలాకుతలం

- రోడ్లపైకి చేరిన వరదనీరు.. రాకపోకలకు తీవ్ర అంతరాయం
- హయత్‌నగర్‌లో నిండిన చెరువులు..
- నేలకొరిగిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం


ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

హయత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలతో పాటు బస్తీలు, కాలనీల రోడ్లన్నీ జలమయమయ్యాయి. హయత్‌నగర్, తుర్కయంజాల్ ప్రాంతాల్లోని చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. వనస్థలిపురం, సాహెబ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, గుర్రంగూడ ఫారెస్టు ఏరియా నుంచి వచ్చే వరద నీటితో హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువు నిండి అలుగు పారుతోంది. అలుగు నీరంతా బాతుల చెరువుకు చేరుతోంది. మరో రెండు రోజులు వర్షం కురిస్తే బాతుల చెరువు నిండే అవకాశం ఉంది.

అలుగు పారుతున్న మాసబ్ చెరువు..

తుర్కయంజాల్‌లోని చారిత్రక మాసబ్ చెరువు నిండి అలుగు పారుతోంది. అలుగు ద్వారా వచ్చే నీటితో హ్యాపీల్ ఎవిన్యూ కాలనీ మీదుగా వరద ఉధృతంగా పారుతోంది. దీంతో ఇంజాపూర్‌లో ప్రభుత్వ నిర్మించిన బడల్ బెడ్‌రూంలు మొత్తం నీట మునిగాయి. ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు పూర్తిగా నిండింది. దీంతో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల చుట్టూ చెరువు నీరు చేరింది. వరద నీరు దిలావర్‌ఖాన్ చెరువు నుంచి హయత్‌నగర్, మునగనూర్ గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టు ద్వారా బంజారా కాలనీ వరద కాలువ గుండా లోతట్టు ప్రాంతాల ద్వారా పెద్దఅంబర్‌పేట్‌లోని ఈదుల చెరువుకు చేరుతోంది.

హయత్‌నగర్‌లో విరిగిన చెట్టు కొమ్మలు..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి హయత్‌నగర్ పాత రోడ్డు సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు కొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడ్డాయి. వెంటనే జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ టీం, విద్యుత్ అధికారులు వచ్చి చెట్లకొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చేశారు. కుమ్మరికుంట చెరువు అలుగు ప్రాంతాలలో చేరిన పిచ్చి మొక్కలు, చెత్తను జేసీబీలతో అధికారులు తొలగించారు.

● హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీ మీదుగా భారీగా వర్షం నీరు వచ్చింది. అరుణోదయనగర్ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, ఫైర్ స్టేషన్ మీదుగా హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువుకు నీరు చేరడంతో నిండింది.

వాహనాల రాకపోకలకు అంతరాయం..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చెరువులు, కుంటల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. బాటసింగారంలోని మంగలోనికుంట, జాఫర్‌గూడ చెరువులు అలుగుపారు తున్నాయి. బాటసింగారం నుంచి మాజీద్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు కొంతమేర అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు ముందు జాగ్రత్తగా వాహనాలు వెళ్లకుండా స్టాఫర్లను ఏర్పాటు చేశారు.


జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి చైతన్యపురిలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

కొత్తపేట డివిజన్‌లో..

కొత్తపేట: భారీ వర్షాలకు కొత్తపేట డివిజన్‌లో దారులు జలమయమయ్యాయి.స్నేహపురి కాలనీ రోడ్ నెం 13, సత్యానగర్ రోడ్ -5 లలో చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాయత్రీపురం - ఎస్ఆర్ఎల్ కాలనీ దారిలో బాక్స్ డ్రెయిన్ పనులు చేపట్టిన ప్రాంతాల్లో పాడైన దారి వరదనీటి ప్రవాహంతో మరింత ప్రమాదకరంగా తయారైంది. ఇక బృందావన్ కాలనీలో అంతర్గత దారులన్నీ బురదమయంగా మారాయి. కాలనీలో ఆగిన బాక్స్ డ్రెయిన్ పనుల వద్ద వరదనీరు చేరుతోంది. మారుతీనగర్‌లో అంతర్గత దారులను వరద నీరు ముంచెత్తింది. దారులను వరద నీరు ముంచెత్తిన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ డీఈ నవీన్‌కుమార్ ఏఈ మాతృనాయక్‌లతో కలిసి కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించారు. వరదనీరు మ్యాన్‌హోళ్లలోకి, వరద కాల్వల్లోకి సాఫీగా వెళ్లేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది చేపట్టిన పనులను వారు పర్యవేక్షించారు.

అత్యవసరమైతేనే ఇంటినుంచి బయటికి రావాలి

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్‌లలో సాధారణ వర్షపాతం నమోదైంది. విజయవాడ జాతీయ రహదారిపై వనస్థలిపురం సుష్మా చౌరస్తా నుంచి మన్సూరాబాద్ వెళ్లే రహదారిపై వరదనీరు చేరడంతో వాహనదారులు, బాటసారుల రాకపోకలు కొంతమేర ఇబ్బందులు తలెత్తాయి. వనస్థలిపురం డివిజన్‌లోని ఎఫ్‌సీఐ కాలనీ నుంచి చింతలకుంటకు వెళ్లే మార్గంలో డ్రైనేజీలు పొంగడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. పలు కాలనీల్లో ఆయన ఆదివారం పర్యటించి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసరమైతేనే కాలనీవాసులు ఇంటినుంచి బయటకు రావాలని సూచించారు.

● హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లోని రోడ్డు నం.4లో చెట్టు కొమ్మవిరిగి కారుపై పడడంతో కారు స్వల్పంగా ధ్వంసమైంది.

● వర్షాలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ కాలనీలో వరదనీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తమ కాలనీ రోడ్డుపైకి చుక్కనీరు వచ్చేది కాదని, ఇటీవల వెలసిన వెస్ట్రన్ తపోవన్, జీ స్క్వేర్ వెంచర్‌ల నుంచి వరదనీరు తమ కాలనీలోకి రావడంతో తమకు ఇబ్బందులు వస్తున్నాయంటున్నారు. వరదనీరు తమ కాలనీలోకి రాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలనీ శివారు కాలనీవాసులు కోరుతున్నారు

జలమయంగా సింగరేణి కాలనీ..

సైదాబాద్: భారీ వర్షానికి సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, ఆదర్శనగర్, కృష్ణానగర్ శంకేశ్వర్‌బజార్ జలమయంగా మారాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరుతో కాలనీ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. శంకేశ్వర్‌బజార్, సింగరేణి కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరటంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ కార్యాలయం రోడ్డుపై పార్క్ చేసిన ఆటో ట్రాలీపై భారీ చెట్టుపడింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..

చంపాపేట: హస్తినాపురం డివిజన్‌లోని రెడ్డికాలనీ, మల్లికార్జుననగర్ కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్, పిండి నారాయణరెడ్డి కాలనీ, చంపాపేటలోని రెడ్డికాలనీ, కర్మన్‌ఘాట్‌లలో రహదారులపై వరద నీరు ప్రవహించింది. ఆదివారం వీచిన ఈదురు గాలులకు కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని సరస్వతి స్కూల్ ఆవరణలో చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడింది. దీంతో మూడు స్తంభాలు నేలకొరిగాయి. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్ విలేజ్‌తో పాటు పలు కాలనీలలో ఆదివారం కార్పొరేటర్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కర్మన్‌ఘాట్ విలేజ్‌లో ఈదురు గాలులకు చెట్టు కూలి వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ జీహెచ్ఎంసీ, విద్యుత్, డీఆర్ఎఫ్ హార్టికల్చర్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి పునరుద్ధరణ పనులు చేయించారు.

గడ్డిఅన్నారంలో..

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ చెరువుకట్ట లోతట్టు ప్రాంతాలైన శారదానగర్, పీ అండ్ టీ కాలనీ, కోదండరామ్‌నగర్, తిరుమలనగర్, వివేకానందనగర్, త్యాగరాయనగర్, కమలానగర్ తదితర కాలనీలలో రోడ్లన్నీ వరద నీటితో నిండిపోయాయి.

న్యూ గడ్డిఅన్నారం కాలనీలో..

చెరువుకట్ట లోతట్టున ఉన్న న్యూ గడ్డిఅన్నారం కాలనీని వరదనీరు ముంచెత్తింది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రావడంతో కాలనీ అంతర్గత రహదారులు నీటితో నిండాయి. వెంకటేశ్వరస్వామి ఆలయం పరిసర వీధుల్లోని పలు ఇళ్లలోకి వరదనీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మోకాళ్లలోతు నీరు చేరడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చైతన్యపురి డివిజన్‌లో..

చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసీనదిని ఆనుకుని ఉన ఫణిగిరి కాలనీలోని పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా హుటాహుటిన అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

ఎల్‌బీనగర్ పరిధిలో..

ఎల్‌బీనగర్: వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శాతవాహననగర్, మైత్రినగర్, అల్తాఫ్‌నగర్, ధర్మపురికాలనీ, సాయినగర్, జనప్రియ, వడ్డెరబస్తీ, తపోవన్‌కాలనీ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నరేష్, కాలనీ ప్రతినిధులు శ్రీపతిరావు, రాజు పాల్గొన్నారు.

ముసారాంబాగ్‌లో 12 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

చాదర్‌ఘాట్: ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 12గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెట్ల కుమ్మలు తడిసి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఇలా ముసారాంబాగ్, మలక్‌పేటలోని అనేక ప్రాంతాల్లో ఫీడర్లు ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోయిందని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది శనివారం అర్ధరాత్రి నుంచి వర్షంలో తడుస్తూనే ఎమర్జెన్సీ విధులను నిర్వహించారు. ముసారాంబాగ్‌లోని నిర్మాణంలో భవనం కవర్ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడడంతో ఫ్యూజ్‌లు కాలిపోయాయి. ముసారాంబాగ్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, శాలివాహననగర్, ఫ్రెండ్స్ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక ద్వారకాపురం, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్, ముసారాంబాగ్ విద్యుత్ ఫీడర్లు ట్రిప్ కావడం కరెంట్ సరఫరా ఆగిపోయింది. ఎట్టకేలకు సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.


ఆస్మాన్‌ఘడ్‌లో ఆటోట్రాలీపై కూలిన చెట్టు


అన్మగల్ హయత్‌నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద విరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ అధికారులు


శారదానగర్‌లో కారుపై విరిగిపడిన చెట్టు కొమ్మ


వర్షపునీటిలో వాహనదారుని ఇక్కట్లు


గాయత్రీపురం - ఎస్ఆర్ఎల్ కాలనీ బాక్స్ డ్రెయిన్ వద్ద దారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద నివారణ చర్యలు


ముసారాంబాగ్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్న సిబ్బంది


కుమ్మరికుంట అలుగు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న అధికారులు

24 గంటలూ అందుబాటులో మాన్‌సూన్ బృందాలు

● మలక్‌పేట సర్కిల్ 6 డీసీ జయంత్

ఓల్డ్ మలక్‌పేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేసి వరద సహాయక చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట సర్కిల్ 6 డీసీ జయంత్ తెలిపారు. ఆదివారం ఉదయం ఓల్డ్ మలక్‌పేటలో వరద నీరు అధికంగా వచ్చే లోతట్టు ప్రాంతాలను, మూసీ వెంట ఉన్న కాలనీలను, వ్యవసాయ మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉస్మాన్‌సాగర్, గండిపేట రిజర్వాయర్ల పూర్తిగా నిండాయని, గేట్లు తెరిసే అవకాశం ఉన్నందున మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలక్‌పేట రైల్వే అండర్ పాసింగ్ వద్ద వర్షం నీరు నిల్వ ఉండి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహాయక చర్యలు చేపట్టామన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేసి 24 గంటలూ ప్రజలకు టీంలు అందుబాటులో ఉంటాయన్నారు.

'ఆందోళన వద్దు.. హైడ్రా అధికారులతో మాట్లాడతా'

● అవసరమైతే సీఎంకు లేఖ రాస్తా

● మీర్‌పేట్ చెరువుల పరిసర కాలనీల నివాసితులకు ఎమ్మెల్యే సబితారెడ్డి భరోసా


సబితారెడ్డిని కలిసిన చెరువుల పరిసర కాలనీల నివాసితులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మూడు చెరువుల పరిసరాల్లో గల కాలనీల నివాసితులు తమ నివాస గృహాలపై ఎలాంటి ఆందోళన చెందొద్దని, హైడ్రా వచ్చి కూల్చి వేస్తుందని భయపడాల్సిన అవసరం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. 'మీకు నేనున్నా.. హైడ్రా అధికారులతో నేను మాట్లాడతా.. అవసరమైతే మీ ఇళ్ల విషయమై సీఎం కు లేఖ రాస్తా.. మీరు ఆందోళన చెందకండి.. నిశ్చింతంగా ఉండండి'.. అని ఆమె వారికి భరోసా కల్పించారు. మీర్‌పేట్‌లోని మంత్రాలచెరువు, చందచెరువు, పెద్దచెరువు బఫర్ జోన్ పరిధిలో నివసిస్తున్న పలు కాలనీలవాసులు ఆదివారం బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం నాయకురాలు, మీర్‌పేట్ ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పాలపర్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సబితారెడ్డిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లోని నివాసాలు కూల్చేస్తారని ప్రచారం జరుగుతుండటంతో తాము భయపడుతున్నామని చెప్పారు. తాము దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇక్కడ ప్లాట్లు కొని, అన్ని అనుమతులు తీసుకుని ఇళ్లు కట్టుకున్నామని, ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లిస్తున్నామని, అయినా ఇప్పుడు తమవి అక్రమ నిర్మాణాలంటూ ప్రచారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 80 ఏళ్ల ఓ వృద్ధురాలు సబితారెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతూ.. 'మా ఇళ్లు కూలుస్తారంట అమ్మా..మేము ఏం పాపం చేశామమ్మా.. వారం రోజుల నుంచి నిద్ర కూడా పట్టడం లేదు' అని వాపోయింది. అనంతరం సబిత మాట్లాడుతూ పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొని ఇల్లు కట్టుకున్న పేద, మధ్య తరగతి ప్రజలకు తాను అండగా ఉంటానని, ఇక్కడి ఇళ్ల జోలికి హైడ్రా రాబోదని, సదరు అధికారులతో తాను మాట్లాడతానని అన్నారు. అవసరమైతే సీఎంకు లేఖ రాస్తానని కూడా భరోసా ఇచ్చారు. కొంత మంది స్థానిక నాయకులు రాజకీయ దురుద్దేశంతో ఇక్కడి ఇళ్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి పుకార్లు నమ్మవద్దని ఆమె సూచించారు. సబితను కలిసిన వారిలో సర్వోదయానగర్, ఎంఎల్ఆర్ కాలనీ, ప్రగతికాలనీ, శివాజీనగర్ తదితర కాలనీల ప్రతినిధులు రాంచందర్, సిద్ధయ్య, శివకుమార్, శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, పాపయ్య, వీరస్వామి ఉన్నారు.

నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి సూచన


సమావేశంలో పాల్గొన్న ఏసీపీ కాశీరెడ్డి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఇందుకుగాను ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని వనస్థలిపురం ఏసీపీ పి.కాశీరెడ్డి సూచించారు. నిబంధనలు అతిక్రమించకుండా, భక్తి శ్రద్ధలతో నవరాత్రి సంబురాలు జరుపుకోవాలని ఆయన కోరారు. గణేశ్ నవరాత్రి వేడుకల సందర్భంగా శనివారం రాత్రి మీర్‌పేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఇక్కడి ఓ ఫంక్షన్ హాల్‌లో గణేశ్ ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదని, వివిధ విభాగాల అధికారులు, ఉత్సవ నిర్వాహకులు సైతం అన్ని విభాగాలతో సమన్వయంతో వ్యవహరించి నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని సూచించారు. నిర్వాహకులు తమ మండపాల వివరాలను పోలీసులకు తెలియజేస్తే పోలీసు శాఖ తరఫున తగిన చర్యలు తీసుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.